క్లుప్తంగా

బాపూజీ ఆశయసాధనకు పాటుపడదాం



పెదపెంకిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దలు

బలిజిపేట: బాపూజీ ఆశయసాధనకు అందరం పాటుపడాలని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు పిలుపునిచ్చారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా సోమవారం పెదపెంకిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేందుకు కారకులైన బాపూజీ స్వాతంత్ర్యం అనంతరం దేశం అత్యున్నత స్థానంలో ఉండాలని ఊహించారు. ఆయన ఆశయసాధనకు అందరం కలిసి పాటుపడాలని సంజీవనాయుడు కోరారు. కార్యక్రమంలో డి.కురిమినాయుడు, ఈ.పవన్, ఎస్.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలికి ఎమ్మెల్యే శ్రద్ధాంజలి



బత్తుల పార్వతి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక పురపాలక సంఘం పరిధిలోని జగన్నాథపురానికి చెందిన బత్తుల పార్వతి చిత్రపటానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. పార్వతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ మేరకు సోమవారం జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిందుపూరు గున్నేశ్వర రావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎంపీపీ దమలపాటి, గ్రామస్తులు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత కాశీ సుందర విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఎస్.వెంకటరమణశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవతామూర్తుల విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు ఘటాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాల మధ్య ఉత్సవమూర్తుల తిరువీధి ఘనంగా జరిగింది. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం



బొమ్మికలో రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ సత్యంనాయుడు

జియ్యమ్మవలస: ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేసుకున్న రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని వెలుగు ఏపీడీ సత్యంనాయుడు అన్నారు. మండలంలోని అలమండ, బీజేపురం రైతుభరోసా కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలు, ఈ-క్రాప్‌లో నమోదైన పంటల వివరాలను ఆర్‌బీకే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 20 మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. రైతుల నుంచి పూర్తి వివరాలు సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానన్నారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం వెంకట్, సిబ్బంది ఉన్నారు.

నేడు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ భవనంలో చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పురపాలక కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. పురపాలక సంఘ అధికారులంతా సంబంధిత సమాచారంతో హాజరు కావాలని కోరారు.

సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి

● ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సాలూరు: ప్రజాసంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలిస్తున్న సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లోను ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఉపముఖ్యమంత్రి,గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రజలను కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని 6వ వార్డులో స్థానిక కౌన్సిలర్ జర్జాపు నీలిమ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గడపగడపకుమనప్రభుత్వం కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో కలిసి పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. తమ వార్డులోకి వచ్చిన రాజన్నదొరకు ప్రజలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటికి వెళ్లిన రాజన్నదొర, జగనన్న పాలనలో ఇప్పటివరకు ఎంత లబ్ధిచేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్‌స్తంభం తదితర ప్రజల సమస్యలను విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా రాజన్నదొర ప్రజలతో మాట్లాడుతూ, ఈ వార్డులో సుమారు రూ.19 కోట్లతో వివిధ పథకాల ద్వారా ప్రజలకు ముఖ్యమంత్రి నగదు అందించినట్లు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికస్వావలంబన సాధించాలని సూచించారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, ప్రజా ప్రతినిధులు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, మాధవరావు, పప్పల లక్ష్మణ, పిరిడి రామకృష్ణ, కర్రి అప్పలస్వామి, బవిరెడ్డి సత్యప్రసాద్,తాడ్డి యశోదకృష్ణ, నాగ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



వాటర్‌స్కీమ్‌ను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర

పట్టణంలో 6వ వార్డు కోటవీధిలో పలు అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర భూమిపూజ చేశారు. రూ.లక్షన్నర జనరల్‌ఫండ్‌తో మంజూరైన వాటర్‌స్కీమ్‌ను ఆయన ప్రారంభించగా, రూ.మూడున్నరలక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన రోడ్లు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు.

ఏప్రిల్ మొదటివారంలో సామూహిక గృహప్రవేశం

● ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సాలూరు: ఏప్రిల్ మొదటివారంలో సాలూరు మున్సిపాలిటీలో టిడ్కో ఇళ్లకు సామూహిక గృహప్రవేశం నిర్వహిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో నిర్మాణమవుతున్న టిడ్కో ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ఒక్కరుపాయికి పేదవాళ్లకి ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ఏడాది మార్చి నెలలో రాష్ట్రంలో లక్షా53వేల టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. సాలూరు టిడ్కో ఇళ్లకు సంబంధించి 1248 ఇళ్లకు గాను 1152 ఇళ్లు ఇప్పటికే జియోట్యాగింగ్ చేశామని వివరించారు. ఇందులో 805 ఇళ్లకు ఎటువంటి ఫీజు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేశామన్నారు. సుమారు రూ.80 కోట్లతో సాలూరులో టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం పూర్తిచేసిందని తెలిపారు. అనంతరం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

మార్చి 15 నాటికి ఎలక్ట్రికల్, రోడ్లు, నీటి బోర్లు తదితర అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి 16న మళ్లీ తాను పరిశీలించి, ఏప్రిల్ మొదటి వారంలో సామూహిక గృహప్రవేశానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి టిడ్కో ఇళ్ల నిర్మాణ ప్రగతి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ నర్సింహమూర్తి, ఈఈ జ్యోతి, డీఈఈ బాలకృష్ణ, ఏఈ ప్రవీణ్‌రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు

సీతానగరం: పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గొర్రెలు,మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకా మందులు బుధవారం నుంచి వేస్తారని సీతానగరం పశువైద్య సబ్‌డివిజన్ ఎ.డి సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక పశువైద్య కేంద్రంలో మాట్లాడుతూ బలిజిపేట, సీతానగరం మండలాల పశువైద్యాధికారుల పర్యవేక్షణలో రెండు మండలాల్లో ఫిబ్రవరి 1 నుంచి గొర్రెలు మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకా మందులు వేస్తారని తెలిపారు. బలిజిపేట మండలంలో 25,350 గొర్రెలు మేకలు, సీతానగరం మండలంలో 19,200 గొర్రెలు మేకలున్నాయని తెలియజేశారు. గొర్రెల కాపరులు, పెంపకం దారులు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకామందులను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో రెండు మండలాల పశువైద్యాధికారులు ఎస్.రామారావు, జి.గణేష్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తం



రావివలసలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది

గరుగుబిల్లి: కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రావివలస జంక్షన్ వద్ద, పెద్దూరులో మానవహారం ఏర్పాటు చేశారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై వైద్యులు పీపీ ప్రియాంక, కె.అరుణకుమారి అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి మందులు వాడినట్లయితే ఆరు నెలలో వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది సిబ్బంది, ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, ఈఓ ప్రకాష్, జోజి, ఎం.నర్సింగరావు, జి.సురేష్‌కుమార్ తదితరులున్నారు.

పౌర హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ నిమ్మల శేఖరం

భామిని: మండలంలోని కాట్రగడ-బిలో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం అధ్యక్షతన పౌర హక్కుల దివాన్ని(సివిల్ రైట్స్ డే) సోమవారం నిర్వహించారు. పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను అధికారులు వివరించారు. ఇతరుల హక్కులకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ నడచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, ఆర్ఐ ఎస్.రాంబాబు, రెవెన్యూ జేఏ జి.చందు, సచివాలయ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన రైతులకు సాగు సలహాలు అందించాలి

కురుపాం: మండలంలోని రస్తాకుంటుబాయిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గిరిజన రైతులకు మెరుగైన వ్యవసాయ సేవలు అందించాలని గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంవత్సరాలుగా ఏజెన్సీలో సేవలు అందిస్తున్నట్లు చెప్పుకుంటున్న కేవీకే శాస్త్రవేత్తలు గిరిజన రైతులు పండిస్తున్న జీడిమామిడి, కంది, పసుపు, రాగులు, జొన్నలు గత రెండేళ్లుగా తెగుళ్ల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. వ్యవసాయ పనిముట్లు కూడా సక్రమంగా పంపిణీ చేయటం లేదని, దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

సిటిజన్ అవుట్ రీచ్ సర్వే వేగవంతం చేయాలి



సిటిజన్ అవుట్ రీచ్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో దేవకుమార్

మక్కువ: ప్రభుత్వం నిర్దేశించిన సిటిజన్ అవుట్ రీచ్ సర్వేను సచివాలయ ఉద్యోగులు వేగవంతం చేయాలని ఎంపీడీవో దేవకుమార్ సూచించారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సిటిజన్ అవుట్ రీచ్‌సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబంలోని మహిళలు పొందుతున్నందున ఈనెల 30,31 తేదీల్లో మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో వారి వివరాలను సిటిజన్ అవుట్ రీచ్‌లో చూపించి వివరాలను లబ్ధిదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ కాపునేస్తం, జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ పథకాల ద్వారా మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవడంతో పాటు ఆదాయం పెంపుదల, అభివృద్ధి మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు వివరించాలని సూచించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

సీతానగరం: కుష్ఠు వ్యాధి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది నిర్వహించిన స్పర్శ-కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలుసూచనలు చేశారు. పూర్తి స్థాయిలో కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13 వ తేదీ వరకు వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు వైద్యసిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని ప్రాథమికలక్షణాల ద్వారా ఈ వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్య సేవలందిస్తారని చెప్పారు. చర్మంపై స్పర్శ లేని పాలిపోయిన, ఎరుపు రంగు మచ్చలు, నూనె రాసి నట్లు మెరుస్తూ కొంచెం దళసరిగా ఉన్న చర్మం,చేతులు, పాదాలు, నరాలు తిమ్మిర్లుగా అనిపించడం, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం,కను బొమ్మలు వెంట్రుకలు రాలిపోవడం, చల్లని, వేడి వస్తువుల స్పర్శ తెలియకపోవడం, చర్మం మీద ముఖ్యంగా వీపు,కాళ్ళు చేతులు మీద గుత్తులుగా కాయలు ఏర్పడడం తదితర లక్షణాల ద్వారా గుర్తించవచ్చన్నారు. వ్యాధి లక్షణాలపై ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా తనిఖీ చేసి మందులు ఇస్తామని డాక్టర్ జగన్మోహన్‌రావు అవగాహన కల్పించి సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులకు రక్త హీనత నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి, ప్రధానోపాధ్యాయుడు ఎం.సన్యాసినాయుడు, సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓటుతో జగనన్న రుణం తీర్చుకోండి



పలగరలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ఇంటింటికీ సంక్షేమ పథకాలను తలుపు తట్టి అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు మళ్లీ ఓటువేసి రుణం తీర్చుకోవాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పలగరలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎవరూ రాజకీయ నాయకుల చుట్టూ తిరగకుండా సంక్షేమ పథకాలు పొందేందుకు వలంటీర్ల వ్యవస్థ ఉందని వారిద్వారా అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుకూ సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నది ఒక్క సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మళ్లీ అటువంటి ప్రభుత్వాన్ని మనం గెలిపించుకునేందుకు, సీఎం జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సేవలకు ప్రజలు ఓటుతో రుణం తీర్చుకోవాలని కోరారు.

ప్రభుత్వం మారితే పథకాలు అందవు

రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓటువేస్తే ఈ పథకాలు అందుబాటులో ఉంటాయని, వేరే ప్రభుత్వాలను గెలిపించుకుంటే పథకాలు ప్రజలకు అందవని ఇది ఖాయమని తెలిపారు. నిరుపేదలకు అండగా ఉండేందుకు, వారి జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందన్నారు. కరోనావంటి కష్టసమయాలలో ప్రజలకు అండగా ఉండి సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డిదే నన్నారు. ఇచ్చిన మాటప్రకారం సకాలంలో సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ఓటువేసి రుణం తీర్చుకోండని కోరారు. వీధికాలువలు, రోడ్లు, తాగునీరు కావాలని సీతంపేటలో ప్రజలు కోరగా తక్షణమే స్పందించి దానికి సంబంధించిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, డీటీ రత్నకుమారి, సర్పంచ్ గౌరమ్మ, ఎంపీటీసీ రామకృష్ణమ్మ, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎస్.భాస్కరరావు, కె.సత్యంనాయుడు, జాన్, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, ఆర్.శ్రీనివాసరావు, విజయ, ఎంపీటీసీలు రామకృష్ణంనాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, టి.ప్రసాదరావు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సర్వే



బూర్జలో సంక్షేమపథకాల వివరాలను సేకరిస్తున్న దృశ్యం

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో లేదోనని పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఒక్కో సభ్యుడికి ఏవిధంగా అందుతున్నాయో మహిళలను అడిగి తెలుసుకుని మొబైల్‌లో లబ్ధిదారుల జాబితాను పొందుపరుస్తున్నారని తెలియజేశారు. అన్ని గ్రామాల్లో రెండు రోజులు నిర్వహించే సర్వేకు మహిళలు సహకరించి సంక్షేమ పథకాల వివరాలను ఇంటింటికి వస్తున్న గ్రామవలంటీర్లకు తెలియజేసి సహకరించాలని కోరారు.

కళ్లాల్లో ధాన్యం నిల్వల పరిశీలన



పెదభోగిలి వరిచేను నూర్పిడి కళ్లంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: మండలంలో వరిచేను నూర్పిడి చేసి కళ్లాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపించి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడతామని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశాల మేరకు పెదభోగిలి రైతు భరోసా కేంద్రం పరిధిలో సీతానగరం, పెదభోగిలి, తామరఖండి, గెడ్డలుప్పి గ్రామాలలో వరిచేను నూర్పిడి చేసిన కళ్లాల్లో ధాన్యం నిల్వలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్‌సీజన్‌లో రైతులు పండించిన వరిచేను దిగుబడి పెరగడం వల్ల ధాన్యం నిల్వలు పేరుకుపోయాయయన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతుల ధాన్యం కొనుగోలుకు జిల్లా ఉన్నతాధికారులు ధాన్యం నిల్వలను గుర్తించాలని ఆదేశించడంతో కళ్లాల్లో పరిశీలించినట్లు చెప్పారు. ధాన్యం నిల్వలను పరిశీలించి నివేదిక తయారుచేసి జాయింట్ కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, అందుకు ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామని, ఇందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిందుపూరు గున్నేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ప్రణాళిక, పారిశుధ్య, పరిపాలన విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. సోమవారం నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నగరపంచాయతీ వాహనాలకు బీమా చేయకపోవడంతో ప్రమాదం జరిగితే సమస్యలు వస్తున్నాయని సభ్యుడు వెలమల మన్మథరావు తెలిపారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయాలని కోరారు. పనుల కేటాయింపును వార్డుల వారిగా సమానంగా పంపిణీ చేయాలని సభ్యులు కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు చేసి ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్ పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేయించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు, తదితరులు

భామిని: సహకార సొసైటీ పరిధిలోని రైతులు తీసుకున్న పంట రుణాలను తిరిగి రెన్యూవల్ చేసుకొని ప్రభుత్వం ప్రకటించిన పావలా వడ్డీ రాయితీ పొందాలని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్ కోరారు. భామిని సొసైటీ కార్యాలయంలో సోమవారం డైరెక్టర్లతో సమావేశమై మాట్లాడారు. ఫిబ్రవరి 28లోగా పంట రుణాలు విధిగా రెన్యూవల్ చేయాలని సూచించారు. ప్రతీ రైతు ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ పొందేలా చూడాలన్నారు. రైతులు క్రాప్‌లోన్స్ రెన్యూవల్స్ కోసం 1బి అడంగల్, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో సొసైటీ కార్యాలయానికి వచ్చి రెన్యూవల్ చేయించుకోవాలని సీఈఓ బొడ్డేపల్లి సన్యాసిరావు సూచించారు. సమావేశంలో ఎంపీటీసీ కె.చంద్రశేఖర్, డైరెక్టర్లు కాగితాపల్లి కృష్ణారావు, బిడ్డిక వీరన్న, పార్టీ నాయకులు మేడిబోయిన చలపతిరావు పాల్గొన్నారు.